మనసు మాలిన్యములనెల్ల మట్టుబెట్టి
పరమ పరిశుద్ధ భావము తో పాదుకొల్ప
జ్ఞాన దృష్టియు నేర్పడ గాననగును
విశ్వమంతయు బ్రహ్మమై వెలుగు నిండు
తత్త్వమెరిగిన వానికి తపము ఏల
సత్యమున్నట్టి వానికి సాధనేల
కల్లకపటాలు లేకున్న క్రతువు ఏల
సత్యమును తెల్పుబాట యీ సాయిమాట.

జీవితమునకు జనన మరణములు సామాన్యమైన కర్మలు. జననమరణముల యొక్క రహస్యము చక్కగా గుర్తెరిగిన భార్గవుడు, ఉత్తరాయణ దక్షిణాయనములను చక్కగా గుర్తెరిగిన భార్గవుడు, శుక్లపక్షము కృష్ణపక్షముల రహస్యములను చక్కగా గుర్తించినట్టి భార్గవుడు, సంతృప్తి నొంది పిప్పలాదునకు నమస్కరించి తన హృదయపూర్వకముగా, కృతజ్ఞతను అప్పజెప్పి ఆనందమును అనుభవించుచుండగా గర్గి వంశీయుడైన సౌరాయని అను నాల్గవ బ్రహ్మచారి అక్కడకేతెంచి స్వామీ! ప్రాణికోటి నిద్రించుచుండు సమయమున నిద్రించువారు ఎవరు? అందులో మేల్కొన్నవారు ఎవరు? అందులో కలలు కనేవారు ఎవరు? మనస్సులో లీనమై ఆనందములో తన్మయత్వమై జీవితాన్నే మరచి కేవలము సంతృప్తుడై వున్నవాడు ఎవరు? ఈ రహస్యములను నాకు తెలిపి మనశ్శాంతి చేకూర్చుమని ప్రార్థించాడు. ప్రాణి నిద్రించు సమయమున యీ ప్రాణి లక్షణములను ఎక్కడ చేర్చుచున్నాడు? అప్పుడు పిప్పలాదుడు సౌరాయనా! సూర్యుడు అస్తమించునప్పుడు తనయొక్క కిరణములను తేజస్సునందు యిముడ్చి రెండవ దినము ఉదఇంచె సమయమున ఆ కిరణములు తిరిగి తనలో చేరి అనుభవించుచున్నట్లుగా మానవుడు నిద్రించు సమయమున తనయొక్క యింద్రియ వ్యాపారములను మనస్సునందు చేర్చుచున్నాడు. అందువలననే నిద్రావస్థయందు మానవుడు చూడలేకపోతున్నాడు. మాటాడలేకపోతున్నాడు, వినలేకపోతున్నాడు, యోచించలేకపోతున్నాడు. కారణమేమిటి? ఇంద్రియముల యొక్క వ్యాపారమంతయు మనస్సున యిమిడి వుంటున్నది. ఐతే యీ నిద్రావస్థయందు పంచప్రాణములు పంచాగ్నులై మేలుకొని వుంటున్నాయి. ఇక్కడ ఉచ్ఛ్వాస నిశ్వాసములు సాధారణమైన ప్రాణము చేత సమానాది తత్త్వము చేత

యీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతూ వస్తున్నాయి. కనుక మానవుడు నిద్రించే సమయములో మేల్కొన్నది పంచప్రాణముల యొక్క పంచాగ్నులే. మానవుడు నిద్రించు సమయమున ఆహాయి, ఆనందము, ఆసుఖము అనుభవించేది జీవుడే. పూర్వము జరిగిన దానిని, యిప్పుడు జరుగుచున్న విషయాలను, పూర్వము తాను చూచినవి, యిప్పుడు తాను చూచుచున్నటు వంటివి, పూర్వము తాను అనుభవించినవి, తాను అనుభవించుచున్నటు వంటివి, యివన్నియు కలలరూపము లోపల అనుభవిస్తున్నాడు మానవుడు. ఇంతేకాక అనేక జన్మల సంస్కారము కూడను తనలో ముద్రింపబడి వుండటం చేత అది కూడను తనకు తెలియని స్వరూపమును కూడను విషయములు కూడను కలలో అనుభవించ గలుగుచున్నాడు మానవుడు. కనుక నిద్రించే సమయమునందు మేలుకొన్నవి పంచప్రాణములే. నిద్రావస్థలో వుండిన హాయిని ఆనందాన్ని సుఖాన్ని అనుభవించేది జీవుడే. స్వప్నావస్థయందు సర్వము తానే కల్పించుకొని తనను తాను కూడను కల్పించుకొని కృత్రిమమైన భావములను అనుభవిస్తూ వుంటున్నాడు తానే. ఈ అన్నింటికీ మనసే మూలకారణము! మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. ఈ రెండింటి యందు, స్వప్నమునకు నిద్రకు, గాఢమైన ఆనందమునకు మూలకారణము మనసే.

ఈ విధమైన సమాధానము శౌరాయునికి చెప్పుచుండగా ఆరవశిష్యుడైన శిబి అందులో ప్రవేశించి 'స్వామి! అంత్యకాలమునందు ప్రణవమును చింతించుచూ వుండిన మానవులకు అక్షర ప్రాప్తి లభించునని శాస్త్రములు ప్రబోధిస్తున్నవి. అనగా శాశ్వతమైన స్థానము చేకూరుతుందని శాస్త్రములు ప్రబోధిస్తున్నాయి. ఇది సాధ్యమా!' అప్పుడు పిప్పలాదుడు 'నాయనా! శిబి! ప్రపంచమంతయు ప్రణవములో నిండి వుంటున్నది. ప్రణవము పరమాత్మ స్వరూపము. ప్రణవమునందలి అకార ఉకార మకార తత్త్వము చేతనే భూ అనే యీ లోకమందు, దీనికంటె వున్నత స్థాయి యందున్న భువర్లోకము నందును, అన్నింటికంటె ఉత్తమస్థాయి యైన సువర్లోకమందు యీ త్రిలోకములందు సర్వవ్యాపకమై అనుభవించేది ప్రణవమే. ఈ ప్రణవమువలనే ఋగ్వేద యజుర్వేద సామవేదములు కూడను అంకితమవుతున్నాయి. ఈ త్రయీ వేదముల యొక్క శబ్దములు కూడను ఓంకారమునందే తనయొక్క పల్లవిని పాడుతున్నది. కనుక యీ భూర్భువ సువర్ అనే తత్త్వములు త్రిలోకములకే కాక, త్రివేదములకే కాక, త్రిమాత్రలకు కూడను సంబంధించినదిగా వుంటున్నది. అనగా అకార, ఉకార, మకారములే త్రిమాత్రలు. భూరు భువ స్సువర్లోకములే త్రిలోకములు. ఋగ్వేద యజుర్వేద సామవేదములే త్రయీ వేదములు. ఏతావాతా సర్వత్ర ప్రణవ నాదము నిండివుంటున్నది. ఈ ప్రణవమునకు అష్టైశ్వర్య స్వరూపమని మరొక పేరు

328059103

శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానంద మయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ
అష్టైశ్వర్యమయీ సదాశివమయీ మాంపాహి ఓంకార స్వరూపిణీం.

ఈ జగత్తునందు సమస్త విధములైన శబ్దములన్నీ కూడను ఓంకారము యొక్క ప్రతిరూపములే. ఈ ఓంకార తత్వమును కేవలము భౌతికమైన లౌకికమైన భావముగా గుర్తించి ఏదో ఓం ఓం ఓం అనుకుంటూ పోయిన వారికి కేవలము భౌతికమైన ఫలములే లభిస్తూ వుంటాయి. కాని ఓంకారమును మననము చేస్తూ మానసిక సంబంధమైన భావముతో చింతించిన వారికి కేవలము చంద్రలోక ప్రాప్తి లభిస్తుందని శాస్త్రము యొక్క ప్రమాణము. చంద్రలోకమనగా మనకు కనిపించే చంద్రలోకము, అమెరికావారు, రష్యావారు వెళ్ళిన చంద్రలోకము కాదు. 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత'. విద్యార్థులు చంద్ర సూర్యుల తత్వాన్ని కేవలము భౌతికమైన స్వరూపకంగా విచారించకూడదు. అనగా మనఃస్థాయికి చేరుతాడు ఈ విధమైన చింతన చేత మానవుడు. చంద్రుడనగా మనస్సు యొక్క తత్వము. సూర్యుడనగా చక్షువు యొక్క ప్రకాశము. మన దృష్టి అంతయూ సృష్టిలో చేరినప్పుడు మన నేత్రమంతయు శాస్త్రమయంగా మారుతుంది. కనుక శాస్త్రమనగా యేదో ప్రత్యేకమైనది కాదు. నేత్రము శాసించినదే శాస్త్రము. ఇదియే ప్రత్యక్షప్రమాణము. ప్రత్యక్ష ప్రమాణమునకు సూర్యుడే ఆధారము. అనుమానప్రమాణమునకు మనస్సే ఆధారము. కాని శబ్దప్రమాణమునకు వాక్కే ఆధారము. ఈ త్రికరణ శుద్ధితో కూడిన సమయమునందే మానవత్వము దివ్యత్వముగా మారుతుంది.

బాహ్య సంబంధమైన జగత్తునకు విశ్వుడు అని పేరు. అంతర్ సంబంధమైన తత్వమునకు హిరణ్యగర్భుడు అని పేరు. అనగా అంతర్ బహిర్ తత్వములందు ఈ విధమైన భేదములు యేర్పడటంలో వున్న మూలకారణము ఏమిటి? ఈ మనస్సు యొక్క తత్వము చాలా పవిత్రమైనది. ఇది అశాంతిలో కూడిన సమయమున భగవత్ తత్వమును చింతించినప్పుడు అది ప్రశాంతిగా రూపొందుతుంది. కనుకనే అశాంతిలోని ప్రశాంతి ప్రశాంతిలోని ప్రకాంతి, ప్రకాంతిలోని పరంజ్యోతి. పరంజ్యోతే పరమాత్మ తత్వమని ప్రబోధిస్తూ వచ్చింది. మనస్సునందుండిన తత్వము హిరణ్యగర్భము అన్నారు. హిరణ్యగర్భుడనగా బంగారు మయమైన లింగము. (స్వామి బంగారు లింగమును సృష్టించారు). ఇది ప్రతిమానవుని యందు హృదయమనే స్థాయిలో వుంటుంది. ఈ బంగారు లింగములో ప్రపంచమంతా ఇమిడి వుంటున్నది. అమెరికా, జపాన్, జర్మని, ఫ్రాన్సు, ఇండియా పాకిస్తాన్ అన్నీ ఇమిడి వుంటున్నాయి. కనుకనే హిరణ్యగర్భాయనమః అని మరొక పేరు. ఈ హిరణ్యగర్భ మనేది సువర్ణమయమైనది. అనగా ఈ సువర్ణమనగా ఎట్టి మార్పులు

వుండవు అని. ఎంతకాలము యీ భూమిలో వుండినప్పటికిని సువర్ణము చెడని పదార్థము. ఎంతకాలము యీ భౌతికమైన జగత్తులో వుండినప్పటికిని హృదయమనేది మారనటువంటిది. heart అనగా physical heart కాదు. spiritual heart. ఇది అనంతమైన తత్వాన్ని ఇముడ్చుకుంటుంది. మానవత్వములో వుండిన దివ్యత్వము యిలాంటిది కాదు. ఈ హిరణ్మయమనే అంగ స్వరూపము పన్నెండు స్వరూపములుగా వుంటుంది హృదయములో. వీటికే ఆదిత్య బ్రహ్మలు అని పేరు పెట్టుకుంటూ వచ్చారు. ఈ ఆదిత్య బ్రహ్మలు ప్రచండుడు. ఇలాంటి బ్రహ్మల చేత వుండినది కనుకనే పన్నెండు నెలలుగా రూపొంది సూర్యుడు హిరణ్మయమైన స్వరూపములో ప్రతి ఉదయము ఆవిర్భవిస్తూ అంతరిస్తూ వుంటున్నాడు. కాని భౌతిక విజ్ఞానములో చూచినప్పుడు దీనికి ఆది అంత్యమనేదే లేదు. సూర్యోదయ సూర్యాస్తమయము లేదు. భూమధ్యరేఖ పైకి వచ్చినప్పుడు యిది పగలనియు, భూమధ్యరేఖ క్రిందికి పోయినప్పుడు రాత్రనియు మనము భావిస్తున్నాము. ఈ రాత్రింబవలు యిద్దరు సూర్యులుగా వుండటంలేదు. ఈ విధమైన రహస్యము పిప్పిలాద మహర్షి శిష్యులకి బోధిస్తూ వచ్చాడు

ఇంతేకాక దీనిని సరియైన సాధన సల్పుటకు భావము, సాధన అని రెండు మార్గములుంటున్నాయి. భావము చేతనే యీ ప్రకాశమును అనుభవించినవాడు తన దివ్యత్వమును తాను తెలుసుకోలేక పోలేడు. తెలుసుకొన్నప్పటికి అది తాత్కాలికమైన తెలివిగా రూపొంది తదుపరి దానికి మరుపు ప్రవేశిస్తూ వుంటుంది. సాధన అనే మార్గములో ప్రవేశించినవాడు దివ్యమైన సూర్యమండలము చేరి అక్కడనుండి బ్రహ్మమండలములో ప్రవేశిస్తూ వుంటాడు. బ్రహ్మ అనగా మరేదో చతుర్ముఖ బ్రహ్మని యింకొక బ్రహ్మ అని మరు భావించనక్కరలేదు. బ్రహ్మమనగా విశాలమే. బ్రహ్మభావము పొందుట అనగా విశాలమైన భావమును పొందుటమే. ఈనాటి సైన్సులో వుండిన భావము ఎలాంటిదంటే అణువులో పరమాణువు, పరమాణువులో పరమాణువు యీ విధంగా ఒకదానికొకటి చిన్నదిగా రూపొందుతూ వస్తున్నది. కాని ఆధ్యాత్మికము అట్లాంటిది కాదు. మహతో మహీయాన్, మహతో మహీయాన్ expand అయిపోతూ వుంటుంది. ఇదియె బ్రహ్మము యొక్క స్వభావము. బ్రహ్మమనగా విశాలత్వము. చంద్రుడనగా మనస్సు అని, సూర్యుడనగా చక్షువు యొక్క ప్రకాశము అని. ఈ విధమైన వేదాంత ప్రభావములను పదముల యొక్క అర్థమును గుర్తించినవాడే యీ ఆధ్యాత్మికములో సరియైన అర్థాన్ని గ్రహించగలడు.

ఈ అంగమనగా ఏమిటి? ఈ భౌతికమైన దేహములో వుంటున్నదా? దీనినే వేదాంతము అంగుష్ఠమాత్రం అన్నారు. అంటే మనము physical heart అని

328059105

భావిస్తున్నాము. కాదు కాదు. ఆధ్యాత్మిక హృదయమును సువర్ణమయమైన - అనగా చెడని పదార్థముతో కూడి తేజోమయమైన ప్రకాశములో సమస్త జగత్తును అందులో ఇముడ్చుకునే శక్తి కలిగినదే లింగము. దీనికొక చిన్న ఉదాహరణము. మీరు బదరీనాథ్, కేదార్‌నాథ్ హృషీకేశ్ ఇవన్నీ చూచి వచ్చి వుంటారు. హిమాలయ పర్వతములు కూడా చూచి వుంటారు. కాని ఈ చూచి వచ్చినవన్నీ ఎక్కడ వున్నాయి. తిరిగి వచ్చినాక అవన్నీ నీ హృదయములోనే వుంటున్నాయి. ఒక్కసారి నీవు నేత్రములు మూసి బదరీనాథ్ think చెయి. ఆ మందిరము, ఆ హిమాలయ పర్వతము, అలకానది ఇవన్నీ నీ హృదయములోనే చిత్రింపబడి వున్నాయి. ఈ జగత్తులో నీవు యేమి చూచావో, ఏమేమి చేశావో వాటినంతా స్మరించినప్పుడు నీ హృదయమనే చిత్రము లోపల ప్రత్యక్షంగా నీకు నిరూపణ అవుతున్నది. అనగా ఈ జగత్తంతా నీయందే వుంటున్నది. నీవు యేమి చూస్తున్నావో అదంతా reflection of the inner being. నీవు యేమి ఏమి మాట్లాడుతున్నావో అదంతా reflection of inner talk. నీవు యేయే పని చేస్తున్నావో అదంతా reflection of inner action. నీలో వుండిన దానిని action లో పెట్టటమే ధర్మము. నీలో వుండిన విషయములను వాక్కుతో స్వచ్ఛంగా చెప్పటమే సత్యము. నీ హృదయములో వుండిన దానిని నీవు సత్యముగా చింతించటమే శాంతి. నీ హృదయములో వుండినదానిని చక్కగా understanding చేసుకోటమే అహింస. హృదయాన్ని Complete గా విశ్వసించటమే ప్రేమ. కనుక సత్యధర్మశాంతిప్రేమ అహింస లనేవి అన్నీ నీ హృదయము యొక్క ప్రతిబింబములే. మానవత్వమనగ మనసు మాటక్రియయు అన్నీ ఒకటిగానే అతికియుంట. మాటలో ఒకటి మనసులో వేరొకటి కార్యమందు ఒకటి కలిగిన కార్యమేమి? కార్యమే శూన్యమవుతుంది. ధర్మము అనగా ఏమిటి? తలపు వాక్కులో రావటం వాక్కును క్రియలో పెట్టటమే ఈ మూడింటి ఏకత్వమే ధర్మము. దీనికే The proper study of mankind is man. ఈనాడు ఈ మూడింటి యందు ఏకత్వమే లేదు. కనుకనే హృదయమంతా మృణ్మయముగా మారిపోతున్నది. ఈ చిన్మయముగా వుండిన స్వరూపము మృణ్మయముగా మారటానికి కారణం ఏమిటి? మానవుని యందున్న స్వార్థ స్వప్రయోజనములే మూలకారణము. ఈ స్వార్థమనేది పోవాలంటే, హిరణ్యగర్భాయనమః, ఆ యొక్క పవిత్రమైన సత్యమైన దివ్యమైన భవ్యమైన నవ్యమైన హృదయ భావమునందు మనము చింత చేయాలి.

అనగా మార్పు చెందని దానిపైన మనదృష్టిని ఇమడ్చాలి. ఇవన్నియు అనిత్యము, అశాశ్వతము, అసత్యములే. దీనిని పురస్కరించుకొని భగవద్గీత 'అనిత్యం అసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వ మాం'. ఈ జగత్తంతయూ ఏనాటికైనా మారు

నదే. ఇది అనిత్యమైనదే. నిత్యసత్యమైనది హృదయ భావమే. ఆ హృదయ భావములో దాసిన ఆదర్శమే చిరంజీవత్వాన్ని పొందుతుంది. అదియే అమరత్వము. అమరత్వమనగా ఏమిటి? పాముపైన కుబుసము వుంటుంది. అది వదలిన తరువాత యీ పాము యే విధంగా వుంటుంది? పాము పొర విడిచినప్పుడు పొరవేరుగా పాము వేరుగా వుంటుంది. కనుక దివ్యమైన హిరణ్యతత్వమును పొందినప్పుడు యీ మృణ్మయము వేరు చిన్మయము వేరైపోతుంది. ఇది కేవలము ఒక మిథ్యమైన శరీరము. పరమాత్మత్వము సత్యమైన స్వరూపము. దీనికి కప్పబడినదే మాయ. పామును పొర కప్పినట్లుగా మానవుని మాయ కప్పి వుంటున్నది. మాయ అనగా భ్రమయే. భ్రమ అంటే ప్రత్యేకంగా లేదు. కేవలము తననుండి ఆవిర్భవించినదే. ఈ భ్రాంతి మనసు ఎప్పుడు ఆవిర్భవిస్తుంది? జ్ఞానము మనలో లేనప్పుడే భ్రాంతి ఆవిర్భవిస్తుంది. ఒక త్రాడును చూచి పాము అనుకున్నావు. త్రాడును చూచి పాము అనుకోటానికి కారణం ఏమిటి? వెలుతురు లేకపోవటం చేతనే. చీకటి ఆవరించటం చేతనే, చీకటి వెలుతురు రెండింటి సమ్మిళితమైన స్వరూపము చేతనే త్రాడును చూచి పాము అనుకుంటున్నావు. ఇది భ్రాంతి. తరువాత నీవు ఒక టార్చివేసి చూసావు. ఇది పాము కాదు త్రాడు అని నిర్ణయమైపోయింది. నీవ నీవు టార్చి వేయక పూర్వము అది త్రాడే. టార్చివేసిన తరువాత చూచినది త్రాడే. టార్చివేయుట మూలమున పాము పోలేదు, త్రాడు రాలేదు. దాని తరువాత త్రాడు రాలేదు పాము పోలేదు. రావటము పోవటము యీ రెండు నీ యొక్క భ్రాంతియే. ఉన్నది ఒకే ఒక తత్వము.

అదే విధముగనే 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' వున్నది ఒకటే అది మార్పు చెందనిది. కనుకనే వేదము హిరణ్యగర్భయనము అనింది. హృదయమునందు, ఉదరమునందు మార్పు చెందనటువంటి బంగారు వర్ణమైన నిత్యసత్యమైన ఒక దివ్యత్వము ప్రకాశిస్తూ వుంటున్నది. ఆ ప్రకాశము యొక్క ప్రతిబింబము చేతనే జగత్తులో కన్నులు చూడగలుగుతున్నాయి, చెవులు వినగలుగుతున్నాయి; నోరు మాటాడగలుగుతున్నది. అది లోపల ప్రకాశించకుండా వుంటే కన్నులు చూడలేవు, చెవులు వినలేవు, నోరు మాటాడలేదు. కాని భౌతిక విజ్ఞానమునందు ఉబవన్న వారు విశ్వసించటం లేదు. కారణం ఏమిటి? దానియొక్క విలువంగా, దానియొక్క విలువంగా వారు గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు కేవలము భౌతికమైన, లౌకికమైన దానియందే వారి దృష్టినంతా ఉంచుతున్నారు ఈనాడు చేసిన పరిశోధనలు రేపు పాతవిగా భావిస్తున్నారు. రేపు చేసేవి నూతనముగా భావిస్తున్నారు. ఈ పాతకొత్త పాతకొత్త అనే దానిలో రోతపుట్టి పోతున్నది సైన్సు.

కానీ ఆధ్యాత్మికము నందు పాత కొత్త అనేది లేదు. 'పూర్ణమదం పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే' సైన్సు పరిణామమంతా, సైన్సు పరిశోధనంతా మానవుని బుద్ధిపై ఆధారపడి వుంటుండాది. కానీ ఆధ్యాత్మిక పరిణామమంతా, యీ ఆధ్యాత్మిక పరిశోధనంతా హృదయములో ఆధారపడి వుంటున్నది. హృదయ మనది గుణములకు సంబంధించినది. Head అనేది కేవలము responsibility. ఈ head అనేది కేవలము పాలరాయి డిపిక్షను. హృదయమనేది కేవలము నెగిటివ్ వంటిది. ఈ నెగిటివ్ మనదగ్గర వుంటే ఎన్ని కాపీలైనా ఎప్పుడైనా చేసుకోవచ్చు. ఇందులో మానవుడు ప్రధానమైన వాడేగానీ యీ చేయబడిన యంత్రములు ప్రధానము కాదు. యంత్ర విశ్వాసకులు సైంటిస్టులు. మంత్ర విశ్వాసకులు ఆధ్యాత్మికులు. అతను సైంటిస్టు యితను సైంటు. Saint పూర్ణత్వమును విశ్వసిస్తాడు. సైంటిస్టు semi circle ని విశ్వసిస్తాడు. పూర్ణము full circle. ఆధ్యాత్మికము. ఎక్కడ ప్రారంభమైందో అక్కడే అంత్యమవుతుంది. ఈ పూర్ణత్వమును అర్ధంగా తుడిచి వేస్తే C అనే semicircle నిలుస్తుంది. ఈ C యే Science. ఒక దగ్గర పుడుతుంది ఒకదగ్గర నిలుస్తుంది. మధ్యలో అనంతమైన అనుమానములలో కూలిపోతుంది. కనుక యీ సైన్సులో సత్యము అని చెప్పటానికే వీలు లేదు. ఈనాడు సత్యమని చెప్పినది రేపు అసత్యంగా మారిపోతున్నది. కానీ ఆధ్యాత్మికము నిన్నా సత్యమే, నేడూ సత్యమే, రేపూ సత్యమే, ఇంకా లక్ష సంవత్సరాలకు కూడా సత్యము సత్యమే. ఇదంతయు మానవుని హృదయమునుండి ఆవిర్భవిస్తుండాది. అట్టి మానవత్వమును యీనాడు విస్మరించాడు. ఈ మానవత్వమును పూర్తి నిర్మూలము చేసుకుంటున్నారు. యంత్రాలను చూచి పొంగిపొరలి పోతున్నారు మానవుడు ఈ ఆస్తియే ప్రధానమైన ఆస్తిగా విశ్వసిస్తున్నాడు. wealth. Men are more valuable than all the wealth of the world. మనిషే నిజమైన wealth.

ఈనాడు ఒక పెద్ద కంప్యూటరు సృష్టించారు. ఈ కంప్యూటరును ఇప్పుడు వర్షము వస్తున్నది నేను యింటికి వెళ్ళాపోవాలి అని ప్రశ్న వేసినప్పుడు నీవు ఒక గొడుగు పట్టుకో యీ లాంగు వేసుకో అప్పుడు నీవూరు చేరుతావు అని జవాబు యిస్తుంది. ఈ జవాబు తానే చెప్పిందా లేక మానవుడు దానిని సరైన రీతిలో adjust చేసి పెట్టినాడా. ఈ computer అంతే కేవలం ఒక rubbish వంటిది. దీనిపైన విశ్వాసము పెట్టుకొని కోట్లరూపాయలు ఖర్చుపెడుతున్నారు.. natural brain. ఆ కంప్యూటరుకు కూడను యీ brain యే పని చేస్తుంది. ఏ పని చేసిందో ఆ brain ను నమ్మకుండా మిషన్‌ను నమ్ముతున్నాము. ఫ్లోరు మిల్లులో గోధుమలు వేస్తే గోధుమ పిండి వస్తుంది. రైస్ వేస్తే రైస్ పిండి క్రింద వస్తుంది. ఇంతే కంప్యూటరు. మనము యేమి పెట్టామో

దానికి తగిన ఫలితము యిస్తున్నాది. పోని అది చెప్పేదే అయితే ఆ computer దగ్గరకు పోయి నేను ఎప్పుడు చస్తాను అని అడుగు చెప్తుతుందేమో? దానికి జవాబులు తెలియదు. కారణం ఏమిటి దానిని నిర్మాణము చేసినవానికే జవాబులు తెలియదు కనుక దానికి కూడా తెలియదు. సైంటిస్టుకు తెలిసిన దానినే కంప్యూటరులో పెడుతున్నాడు. అది ప్రతిబింబము తాను బింబము. తనను తాను నమ్మటం లేదుగాని తద్వారా వచ్చిన ప్రతిబింబమును నమ్ముతున్నారు మానవుడు.

విద్యార్థులారా! self confidence చాలా అవసరము. మీయొక్క ఆత్మ విశ్వాసాన్ని మీరు అభివృద్ధి పరచుకోండి. ఈ ఆత్మకు మించినది మరొకటి లేనే లేదు. వాక్కు మనస్సు ప్రాణము మూడింటి సమ్మిళితమైన స్వరూపము ఆత్మ. ఈ మూడింటి తత్వముల లోపల ప్రాణము చాలా ప్రధానము. ప్రాణమునకు అంతము లేదు. ప్రాణమున్న దేహమునకు అంత్యమున్నదిగాని ప్రాణమునకు అంత్యము లేదు. అదియు సర్వ జీవుల యందు అద్దమునందు ప్రతిబింబించినట్లుగా ప్రతిబింబిస్తూ వుంటుంది. కేవలము ఒకటి మాత్రమే వుండిన చాలదు. మనస్సు, వాక్కు, ప్రాణము ఈ మూడింటి చేతనే ఆత్మ అని పిలవబడి ప్రారంభమవుతూ వుంది. మీకందరికి తెలుసు. రసాయన శాస్త్రము లోపల అనేక రకములైన chemicals mix చేసినప్పుడు యింకొక రకమైన ఫలితము వస్తూవుంటుంది. అదే విధముగనే తాంబూలము nut ఎట్లా వుంటుంది brown గా వుంటుంది. betal leaves ఎట్లా వుంటాయి green గా వుంటాయి. సున్నము తెల్లగా వుంటుంది. ఈ మూడు చేరేటప్పటికి red colour వస్తుంది. అదే విధముగా మానవుని యొక్క మనసూ, మాట, ప్రాణము యీ మూడూ చేరేటప్పటికి అదే ఆత్మ స్వరూపాన్ని ధరిస్తున్నాది. అదే నిజమైన mankind. ఈ మూడింటి ఏకత్వము చేతనే మన జీవితాన్ని సార్థకము చేసుకోవాలి. ప్రతి ఒక్కటి కూడను మానవుని హృదయమునందే వుంటున్నాయిగాని బయట ప్రపంచములో లేవు. దీనిని పురస్కరించుకొనియే సుషుప్తి అవస్థలో వుండిన వానిని హిరణ్యగర్భాయనమః అన్నారు. అందులోనే అమితమైన ఆనందము వుంటుండాది. ఒక చిన్న ఉదాహరణము తీసుకోండి. copper చిక్కితే మనము సంతోష[illegible] పడము. ఇంత brass చిక్కితే సంతోషపడము. కాని బంగారము చిక్కితే చాలా సంతోషిస్తాము. ఈ gold అనేది హృదయాన్ని ఆహ్లాదపరుస్తుంది. ఈ gold అంటే ఏమిటి? అది మట్టే. మట్టి ఎక్కడు చూచినా చిక్కుతుంది కనుక అది చాలా cheap గా మనము వుపయోగ పెట్టుకుంటున్నాము. ఆమట్టి లో gold ఎక్కడో చిక్కుతుంది కనుక దానికి ప్రత్యేకమైన విలువనిస్తున్నాము.

328059109

శరీర సర్వత్రా చిమ్మితే దీనికి కూడా విలువ యివ్వరు. మన దేహములో సర్వత్రా ఎముకలు, రక్తము, మాంసము, కండరములు వుంటున్నాయి. దీనికి ఎవరు విలువ యివ్వటము లేదు. కాని హృదయము అదే బంగారు విలగా తీసుకుంటున్నారు. కనుక హిరణ్యగర్భుడనగా మానవత్వానికి విలువ ప్రసాదించేటువంటి, మానవత్వానికి తేజస్సు ప్రసాదించేటువంటి, మానవత్వానికి ఆదర్శమును ప్రసాదించేటువంటి, మానవత్వమునకు మానవత్వమే ప్రసాదించేటువంటి హృదయమే.

విద్యార్థులారా! ఈ ప్రశ్నోపనిషత్తు యొక్క భావము మీకు అర్థంకాక నేను మిమ్మల్ని చాలా శ్రమ పెడుతున్నాను. ఈనాటితో ప్రశ్నోపనిషత్తు వదలిపెట్టి యిక నిత్య జీవితము లోపల మానవునికి అత్యవసరమైన విషయాలలో మనము యీ మిగిలిన దినములను వుపయోగపెట్టుకుందాం. ఈ ఉపనిషత్తులు గొప్ప గొప్ప వేదాంతులకే పండితులకే అర్థంకాదు. సామాన్యమైన పిల్లలకు, ఏదో యింగ్లీషు పదములు చదువుకొనే వారికి యిది అంతకంటె అర్థము కాదు. ఆంగ్లభాషకు విలువ యిస్తున్నారుగాని తల్లి భాషకు విలువ యివ్వటంలేదు. ఇలాంటి సమయములోపల యింత విలువైనవి చెప్పినప్పటికి సరియైన అర్థమును మీరు తీసుకోటం అసాధ్యం. ఒకటవ తరగతి పిల్లవానికి పదవతరగతి క్లాసు పుస్తకము చెబితే వాని కేమి అర్థమవుతుంది. కనుక ఆ తరగతి బుక్కులే మీకందరికి ఆ తరగతికి సంబంధించిన క్లాసులు తీసుకున్నప్పుడు మీకు సులభంగా హృదయానికి హత్తుకుంటుంది. కనుక రేపటి నుండి మానవునకు ప్రధానమైన విజ్ఞానము, కర్మమార్గము, నిత్యజీవితములో అనుభవించవలసిన ధర్మమార్గము, కర్తవ్య తత్త్వములు లౌకిక జీవితములో వుండిన అర్థములు విచారించుకోటం అత్యవసరము. దేశకాల పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని విద్యార్థులకు నైతిక, భౌతిక, ధార్మికములు బోధించటము చాలా ప్రధానము. ఈ సైన్సు పెరిగే కొలది నైతిక విలువ దినదినమునకు దిగజారిపోతున్నది. మానవునికి విలువలే లేనప్పుడు యింక సైన్సు అభివృద్ధియై ప్రయోజనము ఏమిటి? ఈనాటి విద్యలు ఏవిధంగా వుంటున్నాయంటే ప్రోగ్రెస్సు. ప్రోగ్రెస్సు. పెరిగిపోతున్నాయి.

నీతి నియమాలు గ్రంథాన నిలిచిపోయె
హృదయమంతయు దుర్గంధ మలినమయ్యె
చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె
యిదియె ప్రోగ్రెస్సు యీనాటి విద్యలందు.

328059110

విద్యనేర్పిన వానినే వెక్కిరించు
కూడు పెట్టిన వానినే కూలద్రోయు
మేలు చేసిన వానికే కీడు చేయు
ఇదియె ప్రోగ్రెస్సు యీనాటి విద్యలందు.

ఏమిటి యీ ప్రోగ్రెస్సు. కాదు. కాదు. కృతజ్ఞత మానవునికి ప్రధానమైన ప్రాణము. మనము ఎవరివలన యే మంచిని పొందినామో వారికి జీవితమంతా కృతజ్ఞతను అందించాలి. గురువులను గౌరవించాలి. తల్లితండ్రులను ప్రేమించాలి. తోటి మానవులను మానవులుగా భావించి సన్నిహిత సంబంధ బాంధవ్యమును పెంచుకోవాలి. ఇలాంటి సమరసమైన భావము లేక పోతే యీ చదువుల యొక్క సారమేమిటి? చదువులతో బాటు సంస్కారము కూడను పెంచుకోవాలి. సంస్కారమునకు సరియైన సరుకు రేపటినుంచి మనము అందుకుందాం.